క్లుప్తంగా

మాజీ సర్పంచ్ సోదరుడికి 'అన్నా' నివాళి



ఫ్రాన్సిస్ కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే అన్నా

కొమరోలు: మండలంలోని తాటిచెర్ల గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ గంగిపోగు అలెగ్జాండర్ సోదరుడు గంగిపోగు ఫ్రాన్సిస్ ఆదివారం సాయంత్రం రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న మార్కాపురం వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి అన్నా వెంకట రాంబాబు సోమవారం తాటిచెర్లలో ఫ్రాన్సిస్ మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులతో మాట్లాడి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

కౌలు రైతులకు వడ్డీ లేని రుణాలివ్వాలి



సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న కౌలు రైతు సంఘ నాయకులు

మార్కాపురం: కౌలు రైతుల సమస్యలు పరిష్కరించాలని కౌలు రైతుల సంఘ నాయకులు సోమవారం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కౌలు రైతులకు రూ.2 లక్షల వరకూ హామీలేని పంట రుణాలు ఇవ్వాలని, కౌలు మిత్ర గ్రూపులు ఏర్పాటు చేసి వడ్డీలేని రుణాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కౌలు రైతులు పండిస్తున్న అన్ని పంటలకు ఉచిత పంటల బీమా పథకాన్ని వర్తింపజేయాలని, ప్రకృతి విపత్తులు, చీడపీడలు సంభవించి పంటలు దెబ్బతిన్న పరిస్థితుల్లో బీమా పరిహారం, ఇన్‌పుట్ సబ్సిడీ నేరుగా కౌలు రైతులకు ఇవ్వాలని కోరారు. ఫార్మర్ రిజిస్ట్రర్లో కూడా కౌలురైతుల పేర్లను నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లాకార్యదర్శి ఎస్‌కె ఖాశీం, కొండయ్య, కోటేశ్వరరావు, సిద్ధయ్య, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మాజీ సైనికుడికి తీవ్ర గాయాలు



గాయపడిన సుబ్బారాయుడు

రాచర్ల: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన మండల కేంద్రమైన రాచర్ల మోడల్ స్కూల్ వద్ద సోమవారం ఉదయం చోటు చేసుకుంది. వివరాలు.. గిద్దలూరు పట్టణానికి చెందిన మాజీ సైనికుడు సుబ్బారాయుడు తన బైక్‌పై అర్ధవీడు మండలం కాకర్ల గ్రామానికి వెళ్తున్నారు. ఈ క్రమంలో రాచర్ల మోడల్ స్కూల్ వద్దకు రాగానే కళ్లు తిరిగి కింద పడ్డాడు. ఈ ప్రమాదంలో ఆయన ఎడమ కాలు కింది భాగంలో విరిగి ఎముక బయటపడింది. మోడల్ స్కూల్లో పదో తరగతి పరీక్ష రాసేందుకు వచ్చిన విద్యార్థులు 108 వాహనానికి సమాచారం ఇచ్చారు. క్షతగాత్రుడికి 108 సిబ్బంది ప్రథమ చికిత్స చేసి గిద్దలూరు ఏరియా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

ఇలాంటి అన్నాన్ని మీ పిల్లలకు పెడతారా..

- ఎస్సీ బాలికల హాస్టల్ ను ఆకస్మికంగా తనిఖీ చేసిన సబ్ కలెక్టర్



విద్యార్థులతో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ త్రివినాగ్

మార్కాపురం: ఇలాంటి అన్నాన్ని మీ పిల్లలకు పెడతారా.. మురిగిపోయిన కోడి గుడ్లను కూడా వాడేసి పిల్లలకు ఇస్తారా అంటూ మార్కాపురం సబ్ కలెక్టర్ త్రివినాగ్ సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం రాత్రి మార్కాపురం పట్టణంలోని తర్లుపాడు రోడ్ లో ఉన్న సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహాన్ని తనిఖీ చేశారు. ఇటీవల కాలంలో హాస్టల్లో విద్యార్థులకు పెడుతున్న అన్నంలో పురుగులు వస్తున్నాయని, నాణ్యత లేదని పలువురు సబ్ కలెక్టర్ కు ఫిర్యాదు చేయడంతో ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. గోడౌన్ తనిఖీ చేయగా అందులో ఉన్న కూరగాయలు, బియ్యం నాసిరకంగా ఉండడంతోపాటు కుళ్లిపోయిన కోడిగుడ్లను కూడా పరిశీలించి సిబ్బంది పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలా అయితే ఎలా అంటూ మండిపడ్డారు. ఈ విషయాలపై సమగ్ర నివేదిక ఇవ్వాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. పలువురు విద్యార్థులు హాస్టల్లో తాము పడుతున్న అవస్థలను సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. పదో తరగతి పరీక్షలు రాసేందుకు స్టడీ కోసం ఒక టీచర్ ని కేటాయించాలని ఆదేశించారు. సోమవారం స్థానిక బాలికోన్నత పాఠశాల సిబ్బంది తమ దగ్గర ఉన్న టాబ్‌లు కూడా తీసుకున్నారని సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. తాను ఎంక్వైయిరీ చేస్తానని విద్యార్థినులకు సబ్ కలెక్టర్ చెప్పారు.

పారని మురుగు.. తొలగని చెత్త



అలుగు వద్ద కాలువల్లో పేరుకుపోయిన చెత్త..

- మార్కాపురంలో అధ్వానంగా పారిశుధ్యం
- దోమల దెబ్బకు జనం బెంబేలు

మార్కాపురం: డివిజన్ కేంద్రమైన మార్కాపురం పట్టణంలో పారిశుధ్యం పరిస్థితి నానాటికీ దిగజారి పోతోంది. మెయిన్ రోడ్ల వెంట కాల్వలన్నీ చెత్తా చెదారంతో నిండిపోయి మురుగు ముందుకు కదలడం లేదు. కాలువల్లో ప్లాస్టిక్ వస్తువులు, ఖాళీ కొబ్బరి బొండాలు, ఇతరత్రా వ్యర్థాలు పేరుకుపోయాయి. ముఖ్యంగా పట్టణంలోని కంభం రోడ్డు, ప్రెస్ క్లబ్, కోర్టు సెంటరులోని సీపీఐ ఆఫీస్, ఆకాశవాణి కేంద్రం వద్ద అలుగు ఇలా వివిధ ప్రాంతాల్లో డ్రెయినేజీలు దారుణంగా ఉన్నాయి. మున్సిపల్ సిబ్బంది దృష్టి సారించకపోవడంతో ఆయా ప్రాంతాల్లో ఇళ్ల ముందు మురుగు చేరి రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. పట్టణ నడిబొడ్డున ఉన్న ప్రాంతాల్లోనే ఇలాంటి పరిస్థితి ఏర్పడిందంటే ఇక శివారు ప్రాంతాలు ఎలా ఉన్నాయో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. లక్ష మంది జనాభా ఉన్న మార్కాపురం పట్టణంలో 35 వార్డులున్నాయి. పారిశుధ్య సిబ్బంది పనిచేస్తున్నప్పటికీ ప్రధాన వీధుల్లో మురుగు కాలువలన్నీ పూడికతో నిండిపోవడం అధికారుల పర్యవేక్షణకు వేలెత్తి చూపుతోంది. సాయంత్రం 6 గంటల నుంచి దోమలు దండయాత్ర చేస్తుండటంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. దీంతో ఇంట్లో ఉండలేక, బయటకు రాలేక అవస్థలు పడుతున్నారు. ఇప్పటికే పలువురు మలేరియా, డెంగీ లాంటి ప్రమాదకరమైన జ్వరాలతో ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నారు. పట్టణంలో పలువురు డివిజన్ స్థాయి అధికారులు, మున్సిపల్ అధికారులు ఉన్నప్పటికీ ప్రధాన వీధుల్లోని కాలువల్లో పూడిక తీసి మురుగు ముందుకు కదిలేలా చర్యలు చేపట్టకపోవడంతో ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి పారిశుధ్యాన్ని మెరుగుపరచాలని ప్రజలు కోరుతున్నారు.



కోర్టు సెంటర్‌లో మురుగు కాలువలు ఇలా..



ప్రెస్ క్లబ్ వద్ద పూడికతీయని కాలువ



ఒంగోలు రోడ్డు అలుగు వద్ద పరిస్థితి ఇదీ..



నివాళులర్పిస్తున్న కేపీ, ఉడుముల, జంకె

ఎంపీ వైవీ సుబ్బారెడ్డి మాతృమూర్తికి ఘన నివాళి



నివాళులర్పిస్తున్న అన్నా రాంబాబు

మార్కాపురం టౌన్: వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ పార్టీ నేత, రాజ్యసభ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి మాతృమూర్తి పిచ్చమ్మ పార్థివదేహానికి మార్కాపురానికి చెందిన పలువురు పార్టీ నాయకులు సందర్శించి ఘనంగా నివాళులర్పించారు. మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్, మాజీ ఎమ్మెల్యేలు కేపీ నాగార్జునరెడ్డి, జంకె వెంకటరెడ్డి, ఉడుముల శ్రీనివాసులరెడ్డి, అన్నా రాంబాబు, మున్సిపల్ చైర్మన్ సీహెచ్ బాల మురళీ కృష్ణ, షంషర్ అలీ బేగ్, అన్నా కృష్ణ చైతన్య తదితరులు నివాళులర్పించి వైవీ సుబ్బారెడ్డి, కుటుంబ సభ్యులతో మాట్లాడారు.

వెలిగొండకు రూ.1500 కోట్లు అవసరం



మాట్లాడుతున్న సోమయ్య, పార్టీ నాయకులు

మార్కాపురం: వెలిగొండ ప్రాజెక్టుకు ప్రస్తుత బడ్జెట్ సమావేశాల్లోనే కనీసం రూ.1500 కోట్ల నిధులు కేటాయించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు డి.సోమయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఎం ప్రజాచైతన్య జీపు యాత్రలో భాగంగా సోమవారం మార్కాపురం పట్టణంలో ఆయన మాట్లాడారు. బడ్జెట్‌లో కేటాయించిన 359 కోట్ల రూపాయలను సవరించి రూ.1500 కోట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ నెల 20న వెలిగొండ ప్రాజెక్టు కోసం మార్కాపురం సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. ప్రజలను చైతన్యం చేసేందుకు మార్కాపురం, యర్రగొండపాలెం, గిద్దలూరు నియోజకవర్గాల్లో జీపుయాత్ర నిర్వహిస్తున్నామన్నారు. వెలిగొండ పరివాహక ప్రాంతంలోని అధికార పార్టీ ఎమ్మెల్యేలు ఈ బడ్జెట్‌పై స్పందించకపోవడం ప్రాజెక్టుపై వారి నిర్లక్ష్యాన్ని తేటతెల్లం చేస్తోందన్నారు. మార్కాపురం మెడికల్ కళాశాలను అర్ధంతరంగా నిలిపివేయడం, డాక్టర్లను బదిలీ చేయడం వల్ల వైద్యశాల నిరుపయోగంగా మారిందన్నారు. ప్రభుత్వమే మెడికల్ కాలేజీ నిర్మాణం చేపట్టాలన్నారు. మార్కాపురాన్ని జిల్లా చేస్తామన్న హామీని నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి రఫీ, రూబెన్, కొండయ్య, కట్టా సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

- 12వ పీఆర్‌సీ కమిషన్ ఏర్పాటు చేయాలి
- సబ్ కలెక్టర్‌కు విశ్రాంత ఉద్యోగుల వినతి



సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న విశ్రాంత ఉద్యోగుల సంఘ నాయకులు



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకులు

మార్కాపురం: రాష్ట్ర ప్రభుత్వం పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని విశ్రాంత ఉద్యోగుల సంఘం మార్కాపురం అధ్యక్షుడు డాక్టర్ ఐ.బాలసుబ్బారావు కోరారు. సోమవారం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో విశ్రాంత ఉద్యోగులు నిరసన ప్రదర్శన చేసి సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. 12వ పీఆర్‌సీ కమిషన్ ఏర్పాట చేయాలని, డీఆర్ బకాయిలు, పీఆర్‌సీ బకాయిలు ఇవ్వాలన్నారు. గత పీఆర్‌సీలో తగ్గించిన అడిషనల్ క్వాంటం ఆఫ్ పెన్షన్ పూర్వ పద్ధతిలో 70 ఏళ్ల వారికి 10 శాతం, 75 ఏళ్ల వారికి 15 శాతం పునరుద్ధరణ చేయాలని కోరారు. ఈహెచ్‌ఎస్ కార్డుపై వైద్యం కుదరదని ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యాలు చెబుతున్నాయని, మెడికల్ రీయింబర్స్‌మెంట్ చేయించుకోమని సలహా ఇస్తున్నారని, ఆర్థిక వెసులుబాటు లేక చాలామంది వైద్యం చేయించుకోలేకపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈహెచ్‌ఎస్ కార్డులపై క్యాష్‌లెస్ వైద్యం పూర్తి స్థాయిలో అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు చెంచయ్య, జయరావు, పలువురు విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

బేస్తవారిపేట: రాష్ట్ర ప్రభుత్వం పెన్షనర్స్ సమస్యలను పరిష్కరించాలని జిల్లా రిటైర్డ్ ఉద్యోగుల సంఘం సెక్రటరీ బీవీ సుబ్బారావు, మండల అధ్యక్షుడు సీహెచ్ కోటారెడ్డి కోరారు. సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ జితేంద్రకుమార్‌కు వినతిపత్రం అందజేశారు. 2023 నుంచి పీఆర్‌సీ కమిషన్ నేటికీ వేయలేదని, కమిషనర్‌ను నియమించి ఐఆర్ విడుదల చేయాలని కోరారు. డీఆర్ బకాయిలు తీసుకోకుండానే చాలా మంది మృతి చెందుతున్నారని, బకాయిలు వెంటనే విడుదల చేయాలన్నారు. ఈహెచ్‌ఎస్ కార్డుపై వైద్యం చేసేందుకు ప్రైవేట్ వైద్యశాలలు నిరాకరిస్తున్నాయని, ఈహెచ్‌ఎస్ కార్డుపై క్యాష్‌లెస్ వైద్యం పూర్తి స్థాయిలో అందేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అసోషియేట్ ప్రెసిడెంట్ ఎ.వీరనారాయణ, జనరల్ సెక్రటరీ కేసీహెచ్ వెంకటరామయ్య, విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

శ్రీవారి పుష్కరిణి పనులు ప్రారంభం



పుష్కరిణి చుట్టూ చెట్లు తొలగిస్తున్న కూలీలు

కొనకనమిట్ల: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం వెలుగొండస్వామి ఆలయ సమీపంలోని శ్రీవారి పుష్కరిణి అభివృద్ధి పనులను సోమవారం ప్రారంభించారు. పుష్కరిణి, పరిసరాలు అధ్వానంగా ఉండటంపై ఈ నెల 10న 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి ఆలయ ఈఓ చెన్నకేశవరెడ్డి, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కుందురు కాశిరెడ్డి స్పందించారు. పుష్కరిణి చుట్టూ పెరిగిన పొదలను కూలీలతో శుభ్రం చేయించేందుకు చర్యలు చేపట్టారు. పుష్కరిణిలో నిల్వ ఉన్న నీటిని తొలగించి మళ్లీ సాగర్ నీటితో నింపి భక్తులకు సౌకర్యంగా ఉండేలా తీర్చిదిద్దుతామని ఈఓ పేర్కొన్నారు. బ్రహ్మోత్సవాల ముగింపు రోజున శ్రీవారికి పుష్కరిణిలో చక్రస్నానం చేయించేందుకు తగిన ఏర్పాట్లు చేస్తామని తెలిపారు.

పదో తరగతి పరీక్షలు.. తొలి రోజు ప్రశాంతం



మార్కాపురం జెడ్పీ గరల్స్ హైస్కూల్ వద్ద వేచి ఉన్న విద్యార్థులు



రాచర్ల మోడల్ స్కూల్ వద్ద పరీక్షలు రాసేందుకు వచ్చిన విద్యార్థులు

బేస్తవారిపేట: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు గిద్దలూరు, మార్కాపురం నియోజకవర్గాల్లో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో తొలి రోజు సోమవారం ప్రశాంతంగా సాగాయి. పోలీస్ బందోబస్తు నడుమ ప్రశ్న పత్రాలను పరీక్ష కేంద్రాలకు తరలించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పరీక్షల కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేశారు. విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు సమకూర్చారు. వివిధ రకాల మందులతోపాటు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచారు. సమస్యాత్మక కేంద్రమైన కొమరోలు హైస్కూల్‌పై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు.

బేస్తవారిపేటలోని జెడ్పీ బాలుర, బాలికల హైస్కూల్, పిటికాయగుళ్ల జెడ్పీ హైస్కూల్ పరీక్ష కేంద్రాలను ఎంఈఓ సీహెచ్ రమణారెడ్డి, ఎస్సై ఎస్‌వీ రవీంద్రారెడ్డి తనిఖీ చేశారు. జెడ్పీ బాలుర హైస్కూల్లో 141 మందికిగాను 140, బాలికల హైస్కూల్లో 191కు 190, పిటికాయగుళ్లలో 139కు 138 మంది హాజరైనట్లు ఎంఈఓ వివరించారు.

కంభం: కంభం ప్రభుత్వ ఉన్నత పాఠశాల, వాసవీ విద్యానికేతన్, జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల, సీఎల్ఆర్, న్యూ ఆల్ఫా హైస్కూల్, శ్రీచైతన్య స్కూల్, తురిమెళ్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పరీక్ష కేంద్రాల వద్ద కంభం సీఐ కె.మల్లికార్జునరావు ఆధ్వర్యంలో ఎస్సై నరసింహారావు బందోబస్తు నిర్వహించారు. కేంద్రాల సమీపంలో జిరాక్స్ షాపులను ముందుగానే మూతవేయించారు.

గిద్దలూరు రూరల్: స్థానిక సెయింట్‌పాల్స్ ఏ, బీ సెంటర్లు, రాజానగర్‌లోని పీవీఆర్ బీఈడీ కళాశాల, ఆర్.ఆర్. స్కూల్, సూర్య పబ్లిక్ స్కూల్, జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, ఎస్వీ జూనియర్ కళాశాల, ముండ్లపాడు జెడ్పీ హైస్కూల్లో పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించారు. టంగుటూరు ఎంఈఓ బాలాజీ స్క్వాడ్‌గా వ్యవహరించగా ఆయన వెంట స్థానిక ఎంఈఓ కావడి వెంకటేశ్వర్లు ఉన్నారు. మొత్తం 1164 మంది విద్యార్థులకుగాను 23 మంది గైర్హాజరయ్యారని ఎంఈఓ తెలిపారు.

కొమరోలు : కొమరోలు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన 3 కేంద్రాల్లో ప్రశాంత వాతావరణంలో పరీక్షలు నిర్వహించారు. గిద్దలూరు రూరల్ సీఐ రామకోటయ్య, కొమరోలు ఎస్సై నాగరాజు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు.

రాచర్ల: మండలంలోని ఆకవీడు, రాచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలు, మోడల్ స్కూల్లో పదో తరగతి పరీక్షలు ప్రశాంత వాతవరణంలో నిర్వహించారు. రాచర్ల ఎస్సై పి.కోటేశ్వరరావు ఆధ్వర్యంలో పరీక్ష కేంద్రాల వద్ద పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

మార్కాపురంలో విద్యార్థుల ఆందోళన

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణ, రూరల్ మండల పరిధిలో టెన్త్ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మొత్తం 14 పరీక్షల కేంద్రాల్లో 2,146 మంది విద్యార్థులకుగాను 2118 మంది హాజరయ్యారు. పట్టణంలోని బాలుర, బాలికోన్నత పాఠశాల, సాయిబాలాజీ హైస్కూల్, పీఎస్ కాలనీ, ఎస్సీ,బీసీ కాలనీ, వివేకానంద విద్యాపీఠం, శ్రీచైతన్య హైస్కూల్, భాష్యం, నారాయణ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్, ఓంసాయి విద్యానికేతన్, దరిమడుగు, రాయవరం, రాయవరం గురుకుల పాఠశాల, గజ్జలకొండ పాఠశాలల్లో పరీక్షలు నిర్వహించారు. పరీక్షా కేంద్రాల వద్ద పట్టణ, రూరల్ ఎస్సైలు సైదుబాబు, అంకమరావు బందోబస్తు నిర్వహించారు. కాగా పట్టణంలోని బాలికోన్నత పాఠశాల కేంద్రంలోకి పరీక్ష ప్యాడ్లను లోపలికి అనుమతించలేదు. దీంతో తాము పరీక్షలు ఎలా రాయాలంటూ విద్యార్థులు, తల్లిదండ్రులు కేంద్రం సిబ్బందితో వాగ్వివాదానికి దిగడంతో కాసేపు గందరగోళ పరిస్థితి నెలకొంది. ఈ సమయంలో విద్యార్థుల తల్లిదండ్రులు విద్యాశాఖ అధికారులకు ఫోన్ చేసి సమస్య తెలియజేయగా ప్యాడ్లను అనుమతించారు.



కొమరోలులో పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న గిద్దలూరు సీఐ రామకోటయ్య



కంభంలో పరీక్షా కేంద్రం వద్ద ఎంఈఓతో మాట్లాడుతున్న సీఐ మల్లికార్జున



బేస్తవారిపేటలో పరీక్షా కేంద్రం వద్ద ఎస్సై రవీంద్రారెడ్డి

21 నుంచి 'జార్జి'లో ఎమర్జ్-2025 వేడుకలు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న డాక్టర్ ఆదిమూలపు సురేష్ తదితరులు

మార్కాపురం టౌన్: ఈనెల 21, 22వ తేదీల్లో మార్కాపురం పట్టణంలోని డాక్టర్ శామ్యూల్ జార్జి ఇంజినీరింగ్ కళాశాలలో 19వ జాతీయ టెక్నోకల్చరల్ ఫెస్ట్ 'ఎమర్జ్-2025' నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ రాజబాబు తెలిపారు. ఎమర్జ్-2025 పోస్టర్‌ను సోమవారం మాజీ మంత్రి, కళాశాల సాంకేతిక సలహాదారు డాక్టర్ ఆదిమూలపు సురేష్ ఆవిష్కరించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) ముఖ్యాంశంగా సదస్సు ఉంటుందన్నారు. విద్యార్థులు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల హెచ్ఓడీలు డాక్టర్ పీపీ సాధూనాయక్, ఆదిసత్యనారాయణ, డీస్ మస్తానయ్య తదితరులు పాల్గొన్నారు.